పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్

కూకట్‌పల్లి: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ అన్నారు. మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, గోపాల్‌చౌదరి, కర్క నాగరాజు, సలీం, సోను, శ్రీనివాస్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మస్తాన్ రెడ్డి

మోతీనగర్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో అల్లాపూర్ డివిజన్ వివేకానంద నగర్‌లోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్డు నంబర్1లోని ఇళ్లల్లోకి భారీగా వరదనీరు వచ్చింది. వరదతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేవరింటి మస్తాన్ రెడ్డి వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి వరద నీరు నిలవకుండా, దోమల సమస్య లేకుండా చూస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే పరామర్శ

కూకట్‌పల్లి: టీ న్యూస్ రిపోర్టర్ తండ్రి ఎడ్ల వీరయ్య మృతి చెందారు. మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ సతీష్ అరోరా మహబూబాబాద్ జిల్లా రాజోలు గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లి వీరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై నజర్ !

- తూంకుంటలో 40 మంది నిర్మాణదారులకు నోటీసులు
- మిగతా పురపాలికల్లో చర్యలకు సిద్ధం
- చట్టపరమైన చర్యలపై యంత్రాంగం యోచన



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న అక్రమ కట్టడాలు, బహుళ అంతస్తుల భవన నిర్మాణాలపై జిల్లా అధికార యంత్రాంగం కన్నెర్ర చేస్తోంది. పురపాలికల్లో విలీనమైన పాత పంచాయతీల పరిధిలోని పలు కాలనీల్లో అక్రమ నిర్మాణాలు అధికంగా ఉన్నట్లు గుర్తించిన ఆయా మున్సిపల్ కమిషనర్లు చర్యలకు సిద్ధమవుతున్నారు. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో 40 అక్రమ కట్టడాలను గుర్తించిన కమిషనర్ జ్యోతి సంబంధిత యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు రావడంతో నోటీసులు అందజేసిన అధికారులకు రాజకీయ పెద్దల నుంచి ఒత్తిళ్లు పెరిగినట్లు తెలుస్తోంది.

హైడ్రాకు నివేదిక..

అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు నివేదిక అందజేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధమవుతున్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ జాతీయ రహదారికి ఇరువైపులా ఎలాంటి అనుమతులు లేకుండా ఇబ్బడిముబ్బడిగా డ్రైనేజీ కాలువపై అక్రమంగా వ్యాపార, వాణిజ్య సముదాయాలు నిర్మించినట్లు జిల్లా అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు అందాయి.

అధికారుల చేతివాటం..

మున్సిపాలిటీ పరిధిలో పలువురి ఉద్యోగుల చేతివాటం నిర్వాకం వల్లే అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే పరిస్థితి ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ, మేడ్చల్, గుండ్లపోచంపల్లితో సహా కొత్తగా మున్సిపాలిటీలుగా వెలిసిన ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి పరిధిలోని పాత గ్రామపంచాయతీల్లో కూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

◆ జవహర్‌నగర్, పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట్, కొంపల్లి, దుండిగల్ పురపాలక సంఘాల్లో కూడా అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతున్నా.. పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

అనుమతులు లేని వాటిపై..

శివారు పురపాలక సంఘాల్లో అనుమతులు లేని ఇళ్లు, వ్యాపార సముదాయాల గుర్తింపు ప్రక్రియపై పురపాలక సంఘాలు దృష్టి సారించాయి. అక్రమ కట్టడాల జాబితా తయారీపై ఆయా మున్సిపల్ కమిషనర్లు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. జిల్లాలో వచ్చిన 1.68 లక్షల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తే, 16 పురపాలక సంఘాల పరిధిలో అనుమతి లేని భవనాలు, వ్యాపార సముదాయాలు ఎన్ని.. ? ఉన్నాయన్న విషయం అట్టే విధిమవుతోంది.

పెద్దలైన్ డ్రైనేజీల నిర్మాణానికి కృషి



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: కాలనీల్లో పెద్దలైన్ డ్రైనేజీల నిర్మాణానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. తులసినగర్‌లో వరద నీరు, డ్రైనేజీ పొంగి ప్రవహిస్తుండటంతో ఆయా కాలనీలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీరు పొంగి డ్రైనేజీ లైన్ గుండా రోడ్ల పైకి ప్రవహించడంతో నీరుతో పాటు, మట్టి కూడా రోడ్డుపైకి వచ్చి కాలనీ వాసులకు సమస్య ఏర్పడిందని అన్నారు. వెంటనే వరద నీటి ప్రవాహం ఆగేలా చర్యలు తీసుకోవాలని, వీధులను శుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, సమ్మారెడ్డి, మల్లేష్ గౌడ్, రమేష్, పోశెట్టి గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సూపర్‌వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.

కూలిన గోడను త్వరలో నిర్మిస్తాం

కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



కూలిన గోడను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటి పార్కు, జలవాయువిహార్ కాలనీ మధ్యలోని సరిహద్దు గోడను నిర్మిస్తామని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. భారీ వర్షాలకు మరోసారి కూలిపోయిందన్న సమాచారంతో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, రెండు కాలనీలో కమిటీ సభ్యులతో కలిసి మంగళవారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో పనులు మొదలు పెట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ ఏఈ రాజీవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గౌసుద్దీన్

మోతీనగర్: ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్ అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సెంట్రల్ అల్లాపూర్, పర్వత్‌నగర్ ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. మంచినీటి కొరత, డ్రైనేజీ సమస్యలు, పర్వత్‌నగర్ ఏరియా ఆసుపత్రిలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం సహకారంతో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సయ్యద్ సాబీర్, జాహెద్ షరీఫ్ బాబా, మహ్మద్ నూర్ ఖాన్, షేక్ మౌలాలీ, షేక్ జిలానీ, రాజు, శ్రీనివాస్ యాదవ్, బ్రహ్మ, శంకర్ గంగపుత్ర, ఖదీర్, పర్వీన్, రేవతి, వెంకట నర్సమ్మ, ధన పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మ దహనం

మూసాపేట: ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ చేస్తున్న పోరాటానికి మద్దతుగా మంగళవారం కూకట్‌పల్లిలోని జాతీయ రహదారి వద్ద ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఢిల్లీ నిరసనలో రాహుల్‌గాంధీ తదితర ఎంపీల అరెస్టును నిరసిస్తూ మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇది ఒక చీకటి రోజు అని అన్నారు. ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కులపై దాడి జరగడమేనని అన్నారు. సప్పిడి వినీత్, రాహుల్‌సింగ్ చౌహాన్, సప్పిడి భాస్కర్, జిట్టా సునీల్ యాదవ్, సాయి, సతీష్ పాల్గొన్నారు.



సర్వేకు సహకరించాలి



సర్వేలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టే ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ జీఐఎస్ సర్వే (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సర్వే)కు ప్రతి ఒక్కరూ సహకరించాలని తులసినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి తులసినగర్‌లో జియో గ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సర్వే సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సర్వే ద్వారా గూగుల్ మ్యాప్‌తో పాటు సులభంగా ఇంటిని త్వరగా గుర్తించటానికి సులువుగా ఉంటుందని, ఈ సర్వే ద్వారా అనేక ఉపయోగాలు ఉంటాయని పేర్కొన్నారు. సర్వేకు వచ్చే వారికి బిల్డింగ్ లేటెస్ట్ ఫొటో, ఇంటి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, ఇంటి అనుమతుల వివరాలు, ఇంటి టాక్స్, వాటర్, కరెంట్ బిల్లు, యజమాని ఐడీ ఆధార్ కార్డు, ట్రేడ్ లైసెన్స్ వంటి వివరాలు తెలపాలన్నారు. కార్యక్రమంలో సర్వే సూపర్‌వైజర్ రాంబాబు, అంబేడ్కర్, సరిత, శోభ, మోహన్, సతీష్, రాజు, సుష్మ, కవిత, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి



మండప నిర్వాహకులతో శాంతి సమావేశంలో పాల్గొన్న సీఐ నర్సింహరాజు, డీఐ సక్రమ్

బాలానగర్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని బాలానగర్ సీఐ నర్సింహరాజు అన్నారు. మంగళవారం వినాయక చవితి శాంతి సమావేశం వివిధ మండపాల నిర్వాహకులు, కమిటీ సభ్యులు, పోలీస్ అధికారులుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్వాహకులు, ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని, ముఖ్యంగా మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. మండపాల ఎత్తు, పొడవు, వెడల్పు, విగ్రహాల పూర్తి సైజును పోలీసులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. సమావేశంలో డీఐ సక్రమ్, ఎస్‌ఐలు సరితా రెడ్డి, హాజీమియా, వినోద్ కుమార్, ఏఎస్‌ఐ హనుమయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మంజీర వాటర్ ట్యాంక్ పరిశీలన

ఓల్డ్ బోయిన్‌పల్లి: మంచినీటి సరఫరాలో మురుగు నీరు సరఫరా అవుతుందని ఫిర్యాదు వస్తున్నాయని, తక్షణమే సమస్యను పరిష్కారించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. మంగళవారం వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ హరి శంకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ షంషేర్‌తో కలసి స్వర్ణదామనగర్‌లోని మంజీర వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంక్‌లో నిల్వ ఉన్న వాటర్ ఎలా ఉందని పరిశీలించిన అనంతరం జీఎంకు పలు విషయాలను, సమస్యలను వివరించారు. అనంతరం జీఎం హరిశంకర్ మాట్లాడుతూ.. డివిజన్‌కు హెరిటెక్ వాహనం, నూతనంగా 50 నుంచి వంద వరకు మ్యాన్‌హోల్స్ కవర్స్, ప్లాస్టరింగ్, డ్రైనేజీ క్లీనింగ్‌కు అదనంగా మరో నూతన వాహనాన్ని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. మంచినీటి సరాఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అనిల్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ్‌యాదవ్, ఓంప్రకాశ్ నాయకులు జంగయ్య పాల్గొన్నారు.